నమస్తే తెలంగాణ

ములుగు జయశంకర్ భూపాలపల్లి





సమ్మక్క గద్దె వద్ద పూజలు చేస్తున్న వడ్డెలు




సారలమ్మ గద్దె వద్ద పూజలు చేస్తున్న పూజారులు



**చిలుకలగుట్టకు సమ్మక్క, కన్నెపల్లికి సారలమ్మ..**

- కొండాయికి గోవిందరాజులు, పూనుగొండ్లకు పగిడిద్దరాజు
- ఉద్విగ్నంగా సాగిన ఘట్టం
- చివరి రోజు భారీగా వచ్చిన భక్తులు
- ముగిసిన మేడారం మహాజాతర
- బుధవారం తిరుగువారం పండుగ

# వనంలోకి జన దేవతలు

## భక్తుల జయజయధ్వానాల నడుమ తరలించిన పూజారులు



**లక్షలాదిగా తరలివచ్చిన బిడ్డలకు దీవెనలందించిన అమ్మవార్లు శనివారం సాయంత్రం వన ప్రవేశం చేశారు. భక్తుల జయజయధ్వానాల నడుమ, ఉద్విగ్న వాతావరణంలో చిలుకలగుట్టకు సమ్మక్కను, కన్నెపల్లికి సారలమ్మ, పూనుగొండ్లకు పగిడిద్దరాజు, కొండాయికి గోవిందరాజులను పూజారులు తీసుకెళ్లారు. వన ప్రవేశం తర్వాత కూడా భక్తులు పెద్ద ఎత్తున తల్లులను దర్శించుకొని మొక్కులు చెల్లించుకొన్నారు. - తాడ్వాయి, ఫిబ్రవరి 24**

నాలుగు రోజులపాటు భక్తుల పూజలందుకున్న తల్లుల వన ప్రవేశంతో మేడారం మహాజాతర ముగిసింది. కనుచూపు మేర భక్తులతో కిటకిటలాడిన మేడారం పరిసరాలు ఖాళీ అవుతున్నాయి. 'సల్లంగ చూడు తల్లీ.. రెండేళ్లకు మళ్లొస్తాం' అంటూ భక్తులు తిరుగు పయనమయ్యారు. శనివారం సాయంత్రం ఆదివాసీ సంప్రదాయలతో పూజారులు(వడ్డెలు) అమ్మవార్ల ను వనంలోకి తీసుకెళ్లారు. ముందుగా మేడారం సమ్మక్క పూజారులంతా ప్రధాన పూజారి సిద్దబోయిన మునీందర్ ఇంటికి చేరుకున్నారు. అనంతరం సమ్మక్క గద్దె వద్దకు వెళ్లి ఆడపడుచులు అలుకుపూతలు వేసి, సమ్మక్క తల్లిని డోలివాయిద్యాలు, లక్షలాది భక్తుల జయజయధ్వానాల నడుమ వనంలోకి తీసుకెళ్లారు. జాతర చివరి రోజు లక్షలాది మంది భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా చివరి రోజున భారీగా జనం తరలివచ్చారు. దేవతల వన ప్రవేశం తర్వాత కూడా మొక్కులు చెల్లించుకున్నారు.



సమ్మక్కను చిలుకలగుట్టకు తీసుకెళ్తున్న పూజారులు



సారలమ్మను కన్నెపల్లికి తీసుకెళ్తున్న పూజారులు

### ఉద్విగ్నంగా సాగిన ఘట్టం

దేవతల వనప్రవేశం ఉద్విగ్నంగా సాగింది. ఆదివాసీ పూజారులు డోలివాయిద్యాలతో గద్దెలపైకి చేరుకోగా ప్రాంగణమంతా భక్తులతో కోలాహలంగా మారింది. దర్శనాలను పూర్తిగా నిలిపివేసిన తర్వాత శనివారం సాయంత్రం దేవతల వన ప్రవేశ ఘట్టం మొదలైంది. మొదట గోవిందరాజులును అర్రెం వంశీయుల నేతత్వంలోని పూజారుల బృందం మేడారం గద్దెల నుంచి సరిగ్గా సాయంత్రం 6.52 గంటలకు కొండాయికి తరలించారు. సారలమ్మ గద్దెపై పూజారులు ప్రత్యేక పూజలు చేసిన తర్వాత, అక్కడ ప్రతిష్ఠించిన మెంటె(వెదురుబుట్ట)ను రాత్రి 7.33 గంటలకు తీసుకుని జంపన్నవాగు మీదుగా కన్నెపల్లికి చేర్చారు. సమ్మక్క భర్త పగిడిద్దరాజును సాయంత్రం 6.48 గంటలకు పెనక బుచ్చిరాములు నేత్వత్వంలోని పూజారుల బృందం మేడారం నుంచి కొత్తగూడ మండలం పూనుగొండ్లకు తీసుకెళ్లింది. ఆదివారం సాయంత్రం వరకు వీరు తమ గమ్యాన్ని చేరుకోనున్నారు. సమ్మక్కను గద్దెల నుంచి కొక్కెర కష్ణయ్య నేతత్వంలోని పూజారుల బృందం గద్దెల వద్ద పూజలు నిర్వహించి అక్కడి నుంచి కదిలించి రాత్రి 7.10 గంటలకు వనంలోకి తీసుకెళ్లారు. గద్దెల సమీపంలోని ఎదుర్కోళ్ల ప్రదేశం వద్ద మేక బలితో పూజలు చేసి, అక్కడి నుంచి సమ్మక్కను చిలుకలగుట్టకు చేర్చారు. దేవతల వనప్రవేశంతో మేడారం మహా జాతర అధికారింగా ముగిసింది. వచ్చే బుధవారం మేడారం పూజారులు చేసే తిరుగువారం పండుగతో మహాజాతర అంకం పరిసమాప్తమవుతుంది.

# మేడారంలో శాశ్వత అభివృద్ధి

**చిన్న చిన్న ఘటనలు మినహా జాతర విజయవంతం**

**వచ్చే జాతరకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.. నాలుగు రోజుల్లో కోటీ 45లక్షల మంది దర్శనం : మంత్రి సీతక్క**



మాట్లాడుతున్న మంత్రి సీతక్క, చిత్రంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శబరీశ్

ములుగు, ఫిబ్రవరి 24 (నమస్తే తెలంగాణ) : మేడారంలో శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి పనులు చేపడుతామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీశిశు సంక్షేమ శాఖల మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. శనివారం సాయంత్రం మేడారంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ములుగు కలెక్టర్, ఎస్పీతో పాటు 20శాఖల అధికారులు జాతర నిర్వహణకు కష్టపడి పనిచేశారన్నారు. ఈ జాతరలో రవాణా శాఖ ద్వారా మేడారానికి 10వేల బస్సు ట్రిప్పులు నడిపించి భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశామన్నారు. బస్సుల సంఖ్య పెంచడం వల్ల కొన్ని సాంకేతిక కారణాలతో ట్రాఫిక్ సమస్య ఏర్పడిందని మంత్రి తెలిపారు. చిన్న, చిన్న ఘటనలు మినహా జాతర మొత్తం విజయవంతమైనట్లు సీతక్క చెప్పారు. జాతరకు నాలుగు రోజుల్లోనే కోటీ 45లక్షల భక్తులు వన దేవతలను దర్శించుకున్నారని వివరించారు. వన ప్రవేశం పూర్తయినా భక్తుల రద్దీ కొనసాగుతున్నదని, రేపటి వరకు అన్ని శాఖల అధికారులను అందుబాటులో ఉంచుతామన్నారు. జాతరలో 5,090 మంది తప్పిపోగా 5,062 మందిని గుర్తించి వారి కుటుంబ సభ్యులకు అప్పగించామని, మరో 28 మంది సంబంధిత శాఖ అధికారుల వద్ద ఉన్నారని, కుటుంబ సభ్యులు వస్తే వారిని అప్పగిస్తామన్నారు. ఏమైనా లోపాలు ఉంటే తిరుగు వారం తర్వాత సమావేశం నిర్వహించి చర్యలు చేపడుతామన్నారు. జాతర పూర్తయిన 10రోజుల వరకు పారిశుధ్య పనులను కొనసాగిస్తామని చెప్పారు. గత సంవత్సరం వరదల కారణంగా మేడారంలో భారీ నష్టం జరిగిందని, పరిస్థితులను సరిదిద్ది జాతరను నిర్వహించామని చెప్పారు. కొద్ది రోజుల్లో పూజారులతో సమావేశం నిర్వహించి మేడారం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా చర్యలు చేపడుతామని తెలిపారు. సమావేశంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ డాక్టర్ పీ శబరీశ్, ఐటీడీఏ పీవో అంకిత్, అదనపు కలెక్టర్ శ్రీజ, మేడారం ఈవో రాజేందర్, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి శరత్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



భక్తుల తిరుగుప్రయాణంతో కిటకిటలాడుతున్న మేడారంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణం

# కంపు.. కంపు

**దుర్గంధంగా జాతర పరిసరాలు**

**పేరుకుపోయిన చెత్తాచెదారం, వ్యర్థాలు**

**భరించలేని వాసనతో భక్తులు ఇబ్బందులు**



వాసనను భరించలేక ముక్కు మూసుకొని వెళ్తున్న భక్తులు

ఏటూరునాగారం/తాడ్వాయి, ఫిబ్రవరి 24 : మేడారం జాతర ముగిసింది. జాతర పరిసరాలన్నీ చెత్తాచెదారం, భక్తులు వదిలేసిన వ్యర్థాలు దుర్గంధాన్ని వెదజల్లుతున్నాయి. మేడారం, కన్నెపల్లి, రెడ్డిగూడెం, చిలకలగుట్ట, కొంగల మడుగు, ఊరట్టం, నార్లాపూర్, స్తూపం, జంపన్నవాగు, బస్టాండ్ తదితర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున చెత్త పేరుకుపోయింది. ఇక ప్లాస్టిక్ బాటిల్స్, మద్యం బాటిల్స్ ఎక్కడ పడితే అక్కడే వదిలేశారు. మేకలు, కోళ్ల వ్యర్థాలు కుళ్లిపోయి కంపుకొడుతున్నాయి. దీనికి తోడు అనేక చోట్ల ఏర్పాటు చేసిన బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్, చేతి పంపుల వద్ద నీళ్లు నిలిచి బురదగుంటలు ఏర్పడి ఉన్న భక్తులు ఇబ్బందిపడుతున్నారు. ఆయా శాఖల అధికారులు ఏర్పాటు చేసిన క్యాంపుల్లో ఉద్యోగులు, వర్కర్లకు సమకూర్చిన భోజన వ్యర్థాలు కూడా అక్కడే పడేసి ఉన్నాయి. వీటిని తొలగించడంలో నిర్వాహకులు నిర్లక్ష్యం చేయడంతో వాసన గుప్పుమంటోంది. సుమారు 4వేల మంది శానిటేషన్ సిబ్బందిని నియమించారు.గత జాతరలో మెరుగైన పారిశుధ్య పనులు నిర్వహించిన పంచాయతీ అధికారులు ఈ సారి చేతులెత్తేశారు. సరైన ప్రణాళిక లేకపోవడంతో పారిశుధ్యం పేరుకుపోయి జాతర పరిసరాలు కంపుకొడుతున్నాయి. దుర్గంధ వెదజల్లుతుండడంతో అధికారులు ముందస్తుగానే చర్యలు చేపట్టాలని సమీప గ్రామాల ప్రజలు, భక్తులు కోరుతున్నారు. తల నీలాలు సమర్పించిన ప్రదేశాల్లో కూడా అపరిశుభ్రతతో ఉన్నాయి. కొన్ని చోట్ల భక్తులు వారు విడిది ఉన్నచోటనే మల, మూత్ర విసర్జన చేయడంతో అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. అధికారులు పక్కా ప్రణాళికతో మేడారం జాతర పరిసరాలు క్లీన్ చేయించాలని సమీప గ్రామాల ప్రజలు, భక్తులు కోరుతున్నారు.



మేడారం జాతర పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం